

# మహావీర్
# మేజర్ వాంగ్‌చుక్

# సిపాయి కథలు

1999వ సంవత్సరం.

మే నెల - 24వ తేది.

ఢిల్లీలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి.

మేజర్ వాంగ్‌చుక్ ఎయిర్ కూలర్ ఉన్న ముందు గదిలో కొడుకుతో ఆడుకుంటూ, వాడి ముద్దుముద్దు మాటలు వింటూ మురిసిపోతు న్నాడు. ఆ తండ్రీకొడుకుల ఆటల్ని ఆసక్తిగా మందహాసంతో చూస్తూ నిలబడి ఉంది అర్ధాంగి.

స్వస్థలం 'లే' నుండి ఆ కుటుంబం రెండు రోజుల క్రితమే ఢిల్లీలో ఉన్న మిత్రుని ఇంటికి వచ్చింది. సాయంత్రం వేళ కుటుంబంతో బయటికి వెళ్ళి, ఢిల్లీలోని ముఖ్య ప్రాంతాలను చూపిస్తున్నాడు మేజర్ వాంగ్‌చుక్.

ఢిల్లీలోని మోడర్న్ స్కూల్‌లో చదువుకున్న రోజుల్నుంచీ 'వాంగ్‌చుక్'కి అగ్రశ్రేణి క్రీడా కారుడిగా, పర్వతారోహకుడిగా మంచి గుర్తింపు ఉంది. ఎన్నో పతకాలు, సర్టిఫికేట్లు వచ్చాయి. ఎంతోమంది మిత్రులు, అభిమానులూ ఏర్ప డ్డారు.

అతని శరీరదారుఢ్యాన్ని చూసిన మిత్రులు "ఆర్మీలో చేరరాదూ!" అనేవారు. వాళ్ల నోటి మాట ఫలించినట్లుగా చదువు పూర్తికాగానే చేసిన మొదటి ప్రయత్నంలోనే ఆఫీసర్‌గా సెలక్టయ్యాడు. ట్రయినింగ్‌లో మెరిట్ క్యాడెట్ గా పతకం సాధించాడు.

'లడక్‌స్కాట్స్'కి అతన్ని బదిలీ చేసారు.

లడక్ అతని జన్మస్థలం. అక్కడి వాతావ రణం, ఎత్తయిన కొండలు ఎక్కిదిగటం అతనికి బాల్యం నుండీ అలవాటే. తండ్రి పారామిల టరీ సిపాయి. క్రమశిక్షణకి, దేశభక్తికి, కర్తవ్య పరాయణతకీ మారుపేరు. ముమ్మూర్తులా తండ్రి లక్షణాలే పుణికి పుచ్చుకున్నాడు వాంగ్ చుక్.

శాంతి, ప్రేమలకు ఆలవాలమైన బౌద్ధ మతావలంబి అయిన తండ్రి బాటలోనే తను కూడా బౌద్ధమతం స్వీకరించాడు.

"బాబూ! బుద్ధదేవుడు అహింసను బోధిం చాడు. ఆయన మహాత్ముడు గనుక హింసను అహింసతో జయించాడు. మనం స్వయంగా ఎవరికీ హాని చెయ్యం. మనకు హాని తలపెట్టి నా క్షమించగలం. కానీ, కోటాను కోట్ల ప్రజలు మనం దేశ రక్షణ చేస్తామనే నమ్మకంతో ఈ వీర దుస్తులు మనకు కట్టబెట్టారు. ప్రాణం పోయినా ఫర్వాలేదు. కానీ, దేశ గౌరవం పోకూ డదు. గుర్తుంచుకో..." మొదటి మాటు సెలవు మీద వచ్చినపుడు పాదాలంటి నమస్కారం చెయ్యగా తండ్రి చెప్పిన మాటలు మనసులో నిలిచిపోయాయి.

సైనిక దుస్తులు ధరించినప్పుడల్లా ఆయన మాటలు స్ఫురణకు వచ్చేవి. అనుక్షణం అంకిత భావంతో కర్తవ్యం నిర్వహించటానికి అలవాటు పడిపోయాడు. తండ్రి ఢిల్లీలో సర్వీసు చేసిన రోజుల్లో తనని మోడర్న్ స్కూలులో చేర్పించా డు. చదువు పూర్తయే వరకూ అక్కడే ఉంచి, అన్ని ఏర్పాట్లూ చేసాడు. ఆయనకు ప్రమోషన్ల తో బదిలీలు అయినా తన చదువుకి భంగం లేకుండా చూసుకున్నాడు.

శలవుల్లో లడక్‌లోని తన స్వగ్రామం వెళ్లేవాడు. ఆ రోజులే వేరు! ఆర్మీలో చేరాక, తల్లిదండ్రుల కోరిక మన్నించి, వివాహం చేసు కున్నాడు. అర్ధాంగి అనుకూలవతి, అనురాగ

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

వతి కూడా. ఆమె వచ్చిన వేళ మంచిది. తనకి పదోన్నతి కలిగి మేజరు అయ్యాడు.

తమ కలల పంటగా బాబు పుట్టాడు.

తండ్రి అయిన ఆనందం ఎలా ఉంటుందో వాడు పుట్టాక తెలిసింది.

తనని తన తండ్రి ఎంత ప్రేమిస్తాడో కూడా అర్థమయింది. ఇక తన తండ్రి అయితే మన వడ్ని నేలమీద నడవనియ్యడు. తన తల్లికి వాడు గారాల కొండ.

మైదానంలో షికారు తిప్పమని పేచీ పెట్టే వాడు. అలా తిప్పుతున్నప్పుడు ఒక మాటు తండ్రి తమ ఇద్దరి ఫొటో తీసాడు. దాని కాపీ ఎప్పుడూ పర్సులో ఉంచుకుంటాడు.

పర్సు తీసినప్పుడల్లా ఫొటో కనిపిస్తుంది. కొన్ని క్షణాలు మురిపెంగా చూసి, మళ్లీ జేబులో ఉంచేసుకుంటాడు.

జూన్ 11వ తేదీ పిల్లాడి జన్మదినం. ఆ రోజున మిత్రులందర్నీ పిలిచి ఘనంగా వేడుక జరపాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. తమ మిత్రులందరూ ఢిల్లీలోనే ఉన్నారు కాబట్టి అక్కడే ఆ కార్యక్రమం చేయాలని నిశ్చయించుకున్నారు.

కానీ, అన్నీ అనుకున్నట్లు జరగవు.

మే నెల 25న సాయంత్రం ఆదేశాలు వచ్చాయి.

మర్నాడు యుద్ధరంగానికి చేరుకోవాలి.

ఆ వార్త తెలుసుకుని భార్య హతాశురాలయింది. వాంగ్‌చుక్ మోహంలో ఎప్పటిలాగానే మందహాసం స్థిరంగా ఉంది.

"అబ్బాయి పుట్టినరోజు పండగ..." ఆమె అర్థోక్తిలో ఆగిపోయింది. గొంతు గద్గదమైంది.

"వస్తాను. ఆ రోజున మీ దగ్గరే ఉంటాను..." ఆమెను, కొడుకునూ హత్తుకుంటూ ధైర్యం చెప్పాడు వాంగ్‌చుక్.

ఆమె మరేమీ మాట్లాడలేదు.

> సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.
>
> ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ *1964* నుంచి *1980* వరకు వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధవీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

★ ★ ★

"మేజర్ వాంగ్‌చుక్! లడక్ స్కౌట్స్ గౌరవం ఇప్పుడు మీ చేతుల్లో ఉంది" కమాండర్ గంభీరంగా అన్నాడు.

"మీ ఆకాంక్ష తప్పక నెరవేరుస్తాం సర్" ధృఢంగా అన్నాడు వాంగ్‌చుక్. అతని మొహంలో అదే మందహాసం.

"మీకు సియాచిన్ సమరంలో మంచి అనుభవం ఉందికదా? ఆ అనుభవం ఇప్పుడు ఉపయోగించుకోవాలి."

"తప్పకుండా!"

"ఇక మీకు అప్పగించిన బాధ్యత గురించి చెబుతాను. వినండి..." – మిలటరీ మ్యాపు మీద సూచికతో తాకుతూ "ఇది బటాలిక్ శిఖరం. దీని దగ్గర... ఇదుగో ఇక్కడ 'చోర్బట్ లా' ఉపక్షేత్రం ఉంది. ఇది చాలా కీలకమైన



కుమారునితో వాంగ్‌చుక్

క్షేత్రం. దీనిని మీరు వశం చేసుకోవాలి."

"అలాగే" - మ్యాపుని పరిశీలనగా చూస్తూ అన్నాడు వాంగ్‌చుక్.

"మీ ప్లెటూన్ సిద్ధంగా ఉంది. మీరు వెంటనే బయల్దేరండి."

"అలాగే సార్" శాల్యూట్ చేసి, నిష్క్రమించాడు వాంగ్‌చుక్.

★ ★ ★

మే 31వ తేదీ. 1999 సంవత్సరం.

కార్గిల్‌లో రక్తం గడ్డ కట్టించే హిమ శిఖరాల్లో అది ఒకటి. ప్రపంచంలోనే మహా ప్రమాదకరమైన కదనరంగం కార్గిల్. ఉష్ణోగ్రత మైనస్ 6 డిగ్రీలకు పడిపోతుంది. 18,000 అడుగుల ఎత్తులో పలచని గాలిలో, ఆక్సిజన్ అతి తక్కువగా ఉండే ఆ వాతావరణంలో అడుగు తీసి అడుగు వెయ్యటమే కష్టం. 80 డిగ్రీలు ఏటవాలుగా ఉండే ఆ పర్వతం మీదకు ఎగబ్రాకుతూ వెళ్లటం ఆరితేరిన పర్వతారోహకులకు కూడా కష్టసాధ్యమే.

తన 36 మంది సహచరులతో మేజర్ వాంగ్‌చుక్ చోర్బట్‌లా శిఖరం మీదకి ఎగబ్రాకసాగాడు. మిలటరీ వ్యూహం ప్రకారం పైనున్న శత్రువుల దృష్టి మళ్లించేందుకు, వాళ్లని ఆత్మరక్షణలో పడెయ్యటానికి శతఘ్నిదళం నిర్విరామంగా శిఖరం మీదకు బోఫోర్స్ శతఘ్ని గుళ్లను సంధిస్తూనే ఉంది.

శిఖరానికి సమీపంలో ఉండగా 'ఇక శతఘ్నుల కాల్పులు ఆపమని' వాంగ్‌చుక్ వైర్లెస్‌లో కోరాడు. లేకపోతే అవి తమకే తగలవచ్చు!.

శతఘ్నులు నిశ్శబ్దం వహించాయి.

మేజర్ వాంగ్‌చుక్‌ని వెన్నంటే ప్లెటూన్ జె.సి.వో. (జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్) ఉన్నా

డు. మిగతా సైనికులు కూడా మొక్కవోని ధైర్య సాహసాలతో తమ ప్లెటూన్ కమాండర్‌ని అను సరిస్తున్నారు. కాస్సేపటిలో శిఖరం చేరుకుం టూండగా, అప్పటికే పాకిస్థాన్ వైపు నుండి - మంచు గొడ్డళ్లు శబ్దం చేసుకుంటూ, చొర బాటుదారులు శిఖరం చేరుకోవటం 'వాంగ్ చుక్' కంటపడింది. వాళ్లు తుపాకులు సంధించే లోగా "ఫైర్" అంటూ భీకరంగా గర్జించి, మెషీ న్‌గన్‌తో కాల్పులు ప్రారంభించాడు.

వెంటనే సహచారులు కూడా శత్రువుల మీదకు తూటాలు కురిపించారు. పైన అలికిడి లేదు. ఎందుకయినా మంచిదని బోఫోర్స్ శత ఘ్నులు పేల్చినప్పుడు ఆ గుళ్లతో ఏర్పడిన పెద్ద పెద్ద కంతల్లో తలదాచుకున్నారు. వారు అనుమానించినట్లే మరి కాస్సేపటికి పైనుండి కాల్పులు ప్రారంభమయ్యాయి.

"మిత్రులారా! జాగ్రత్తగా మిమ్మల్ని మీరు రక్షించుకోండి... మీ సాహసం వృధాకాకూడ దు. ఇంత ఎత్తు ఎక్కగలగటం మీ మొదటి విజయం. మీ ప్రాణాలు రక్షించుకుంటూ, తూ టాలు వ్యర్థం కాకుండా శత్రువుల్ని మట్టుపెట్టా లి. అదే మనకు అసలైన విజయం." ఆయాసం అణచుకుంటూ అన్నాడు వాంగ్‌చుక్.

అతనికి క్రికెట్ ఆట గుర్తొచ్చింది. తన మిత్రులతో తరచుగా ఆడుతుండేవాడు. వికెట్ కాపాడుకుంటూ ఎక్కువ రన్‌లు చేసేవాడు. యుద్ధరంగం కూడా క్రికెట్ లాంటిదే. ఇక్కడ ప్రాణాలు కాపాడుకుంటూ శత్రువుని జయిం చాలి. తూటా గాయాలు తిన్నా, ప్రాణం పోయి నా యుద్ధ క్రీడలో వీగిపోయినట్లే. అందుకే తన సహచరుల్ని హెచ్చరించాడు. అదృష్టవ శాత్తూ అందరూ ఇంత వరకూ క్షేమంగానే ఉన్నారు. ఓర్పుగా తగిన సమయం కోసం నిరీక్షిస్తూ అలాగే ఉండిపోయారు.

వాంగ్‌చుక్‌కి దాహం వేసింది. వాటర్ బాటిల్ తీసి రెండు గుక్కలు నీళ్లు తాగాడు. మళ్లీ మూత బిగించి యథాస్థానంలో ఉంచా డు. యుద్ధరంగంలో మంచినీళ్లు కూడా ఎంతో పొదుపుగా వాడాలి. బాగా చలిగా ఉన్నప్పుడు చక్కని చిక్కని 'టీ' చేసి ఇస్తుంది శ్రీమతి. ఆమె చంకలో పిల్లవాడ్ని ఎత్తుకుని నిలబడి తన మొహంలోకే చూస్తూ "అబ్బాయి పుట్టినరోజుకి తప్పక వస్తారు కదూ?" అని అడుగుతున్నట్లే కళ్ల ముందు కదలాడుతోంది. వాళ్లకి ధైర్యం చెప్పాడు. నిజంగా తను వెళ్లగలడో... లేడో... బుద్ధ భగవానుడికే తెలియాలి!

తమ గ్రామంలోని టీ కొట్టు యజమాని పింటు మాటలు గుర్తొచ్చాయి. టీ కప్పు అంది స్తూ "వాంగ్‌చుక్! నువ్వు చీమని చంపటాని క్కూడా సందేహిస్తావే! యుద్ధంలో మనుషుల్ని ఎలా చంపుతావ్?" అనడిగాడు.


"మనుషుల్ని ఎందుకు చంపుతాను? శత్రు వుల్ని చంపుతాను. వాళ్లు మన దేశానికి హాని తలపెట్టినపుడు ఎందుకు ఊరుకుంటాను? చీమల్ని చంపని వాళ్లు తేళ్లని, పాముల్నీ చంప టం లేదా?" అని ఎదురు ప్రశ్నించాడు. "నిజమే నిజమే" అని ఒప్పుకున్నాడు పింటూ.

"సాబ్..." ఉలిక్కిపడ్డాడు వాంగ్‌చుక్.

"ఏమిటి?" అన్నాడు సహచరుడికేసి చూస్తూ.

"అటు చూడండి" అంటూ మెల్లగా తమ వైపు వస్తున్న శత్రువుల్ని చూపాడు. 'మాట్లాడ వద్దని' సౌంజ్ఞచేసి, వాళ్లు తుపాకీ తూటా గురికి అందుబాటులోకి రాగానే "ఫైర్" అంటూ కాల్పులు సాగించాడు వాంగ్‌చుక్.

అంతే! నలుగురు శత్రువులూ ప్రాణాలు కోల్పోయారు.




దుస్సాహసంతో వాళ్ల చావు వాళ్లే కొని తెచ్చుకున్నారు!

మర్నాడు మధ్యాహ్నం వరకూ అలాగే ఉండిపోయారు వాంగ్‌చుక్ దళం సైనికులు.

"అనుమానం కలగకుండా మెల్లగా పైకి పాకండి" - ముందు తను పాకుతూ సహచరుల్ని ఆదేశించాడు. శత్రువులకి మృత్యువు ముంచుకొస్తోందని తెలియదు. ప్రమత్తంగా ఉండి, తమలో తాము మాట్లాడుకుంటున్నారు. వాంగ్‌చుక్ ఆలస్యం చెయ్యలేదు. తుపాకులు గర్జించాయి. శత్రువులు తలోపక్క వాలిపోయారు. ఒక్కరు కూడా మిగల్లేదు.

వాంగ్‌చుక్ ఉత్సాహంగా, గాల్లోకి తుపాకీ ఎత్తి పట్టుకుని "జైహింద్! సోదరులారా! మనం జయించాం" అంటూ అరిచాడు. అందరూ కేరింతలు కొట్టారు. తమ విజయానికి గుర్తుగా అక్కడ జాతీయ పతాకం ఎగురవేసారు.

వాంగ్‌చుక్ 'లడక్‌స్కౌట్స్' కమాండర్‌కి తమ విజయగాథ 'వైర్లెస్'లో ఉత్సాహంగా చెప్పాడు. ఆయన ఆనందంతో తబ్బిబ్బై ప్రశంసల వర్షం కురిపించాడు. ఆ తర్వాత వాంగ్‌చుక్‌కి, మరో ఏడుగురికీ వారి ధైర్య సాహసాలకి గుర్తింపుగా సైనిక పతకాలు ఇవ్వబడ్డాయి.

వాంగ్‌చుక్‌కి మహావీరచక్ర పతకం లభించింది.

ఆయన క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్లాడు. కొడుకు జన్మదినం రోజున కాదు. ఆ తర్వాత చాలా రోజులకి, కార్గిల్ యుద్ధం ముగిసాక... వెళ్లాడు!

ఆయన ఇంటికి వెళ్లిన రోజునే పండుగ జరుపుకున్నారు.

కొడుకుని గాఢంగా ఆలింగనం చేసుకుని ముద్దు పెట్టుకున్న వాంగ్‌చుక్‌తో కొడుకు "నాన్నా! నన్ను యుద్ధంలోకి ఎప్పుడు తీసుకువెళ్తావ్" అని ముద్దు మాటలతో ప్రశ్నించాడు. వాంగ్‌చుక్ మందహాసం చేసాడు.

"దేశం పిలిచినపుడు..." అన్నాడు కొడుకుని గర్వంగా చూస్తూ. ●